

# ధగాపత్ర!

పేరి రామమూర్తి

*దరిద్ర దేవత తాండవమూర్తిలా 'ఉంటే జాలిపడి ఉన్న శాస్త్ర ధర్మం చేశాడు, ఆనందం. కాని ఆ బిచ్చగాడి చిత్రమే మామగారి ఇంట్లోనూ ఉంటే ఆశ్చర్యపడ్డాడు. ఇంతకూ అల్లుడు ఉద్యోగానికి ధగాపతు మాట ఏమిటి?*

---

"అకాకానికలెక్టరుఉద్యోగానికేలయిదు వందలూ! మరి అల్లుడు ఉద్యోగానికి పది వేలు డిపాజిట్టు కట్టాలంటే సబబు కాదా ఏమిటి?" సాగదీసి పలుకుతూ చప్పరించేశాడు సాగరం.

"డామిట్! అల్లుడు ఉద్యోగమేమిట్రా! ఆ పదాన్నే అపభ్రంశం చేసి పడేశావ్ దరిద్రుడా!" కొత్తగా అల్లుడైన దర్శనం గొంతు చించుకున్నాడు. సాగరం సముద్రం పొంగినట్లు ఎగిరి గంతేశాడు.

"ఏం? ఎందుక్కాదూ—ఎందుక్కాకూడదూ అంట — అదీ ఉద్యోగమే! మామగారు ఆఫీసరు. అత్తగారు పి. ఏ. ఒక్కోప్పుడు అత్తగారే ఆఫీసరు. మామగారామెగారి పి. ఏ. పెళ్లాంగారు మరి...మరి...పెండింగ్ ఫైలూ! కాదంటావా?" గర్జించబోయి, కీచుమని ఫీంకరించాను కాబోలు తెమ్మసుకున్నాడు సాగరం.

"తీసెయ్యరా నీ కుతర్కం నాముందూ!" వాడిగా వేడిగా పలికాడు దర్శనం. ఆ మాట ప్రియురాలికోసం దాచుకున్న సాగరం గుండెల్లో దూసుకుపోయింది.

"నా బోడి తర్కాన్ని తిట్టక నీ బోడిన్నర 'లా' బూజుదులుపుకోరారాస్కేల్!" తర్కవేదాంతాలు తిరిచి చదువుతూన్న సాగరం 'లా' చదువుతున్న దర్శనంపైన విరుచుకు పడ్డాడు.

వీరిద్దరి కొట్లాటా వినకుండా కిటికీలో కూర్చొని చంద్రుడిని చూస్తూ 'అచ్చం' నాయుకుడి ఫోజులో విరహబాధ పడుతూన్న బ్రహ్మానందాన్ని చూసి, చాలా విచారించి ఏడుపు మొహం పెడుతూ, "కాంట్ హెల్ప్" అనబోయి "కాంత్ హెల్ప్" అన్నాడు టకారం పలకలేని అనంతం.

"కాంత్ ఏం హెల్ప్ చేస్తాడోయ్! వాడి మొఖం. ముచ్చటగా మూడు పైసలకి గీస్తున్నా వాడిదగ్గర ఒక్క చిత్రం గీయించుకునే వాడు లేడు యీ రోజుల్లో..." నసిగాడు దర్శనం.

"కాంత్ కాదురా చవట దద్దమ్మా, వాడు కాంట్ అంటే నువ్వు కాంత్ అను... అందుకే నీ పేరులో 'సు' తీసేసి పట్టి పెట్టి చవట దర్శనం అవడం!" తానన్న మాటకు తానే ఓసారి పొంగిపోయి మళ్లీ ఉప్పొంగి పోయాడు సాగరం. దర్శనం ఒళ్లు భగ్గున మండింది. పళ్లు పటపటలాడించాడు.

"ఏనామిలు పోతుంది జాగ్రత్త!" హెచ్చరించాడు దారీ తెన్నూలేక దంత వైద్యానికి పాల్పడిన అనంతం. కిచకిచ నవ్వు నవ్వాడు సాగరం. దర్శనం బోడి తలమీద మొలకజుట్టు సూదుల్లా నిగడదన్నుకుంది.

బ్రహ్మానందం 'ఉస్సు'మని ఓగాడుపు పీల్చాడు. వడ దెబ్బ తిన్న చిన్న మొక్కల్లా తెల్లపోయారు

అనంత సాగర దర్శనాలు.

ఒక్క గుక్కలో అసలు విషయం చెప్పాలంటే చేప కన్నులు గిరగిరా త్రిప్పుతూ, వాలుజడ వక్షోజాలపై వల్లెవాటుగావడేసిగువ్వపిట్టలా గువ గువ లాడుతూ అందరినీ ఇట్టే సమ్మోహితులను చేసి పడేసే దివాన్ బహద్దరుగారి ఏకైక సంతానం మృణాళిని బ్రహ్మానందాన్ని చూసి సముద్రమంత లోతు ప్రేమ బురదలో దిగబడిపోయి, 'బ్రహ్మానందం! నిన్నుచూస్తే నాకు మహదానందం!' అనేసి పావురాయి రెక్కలు విదిలించినట్లు కళ్ళు చకచకా చికిలించిందట. అంతే. ఆ బాపతు ప్రేమ పావకం పీకల దాకా త్రాగేసి గ్రరున తేనుపు పెట్టాడు బ్రహ్మానందం. ఆ తరువాత పాపం పురి త్రేనుపులు పట్టుకున్నాయి. దంతవైద్యం చదువుతున్న అనంతం మొదట్లో ఆ రోగం అంతు తెలియక హడలిపోయాడు. ఆ విషయం వితర్కిస్తూ తర్కంలో పడి తలాతోకా తెలీక బావురు మన్నాడు సాగరం. దర్శనం ప్రేమదర్శనాలు తిరగేసి సుదర్శనాలతో సూక్ష్మంగా పరీక్షించి న్యాయ శాస్త్రానికి అన్వయించి అది చట్టబద్ధమైన ప్రేమ రోగమని తేల్చి చెప్పాడు. కాస్సేపు మేధావినని గర్వించి తల తడుముకున్నాడు కూడా. దశమన్మథావస్థల్లో విరహం గురించి విచారిస్తూ సాహిత్యం చదువుతున్న బ్రహ్మానందం బాధగా మూలిగాడు ప్రత్యక్షానుభవంతో. బ్రహ్మచారి జీవిత భాగస్వాములైన అనంత సాగర దర్శనాలు (దర్శనం మొన్ననే తిరుపతిలో పెళ్లి చేసుకుని వచ్చాడు) బ్రహ్మానందం పరిస్థితికి విచారించి, గ్రుడ్లు తేలేసి, 'కాంట్ హెల్పు' అని చప్పరించారు.

ఇంకిలా బాధపడి లాభం లేదనుకొని ఓ శుభోదయ వేళ దివాన్‌బహద్దరు గారి దగ్గర ఏ విషయమూ తేల్చేసుకునే ఉద్దేశ్యంతో బయలుదేరి వెళ్లాడు బ్రహ్మానందం.

"బ్రహ్మానందం! రండి" అన్నారు దివాన్ బహద్దరు పాపారాయుడుగారు. మృణాళిని తనను గురించి చెప్పేసి ఉంటుందని అనుమానపడి మహదానందంతో, "అరే! నా పేరు మీ కెలా తెలిసింది?" అన్నాడు బ్రహ్మానందం.

"అబ్బే! నాకు తెలీదే" అన్నారాయన ముఖం చిట్లించుకొని. బ్రహ్మానందం ముఖం కగ్గిపోయిన కంచుచెంబులా అయింది.

"నా పేరు *బ్రహ్మానందం*" అన్నాడు.

"బ్రహ్మానందం! ఆ మాట నా కెంతో ఇష్టం" అన్నారాయన. రెండు నిమిషాల మౌనం ఆవరించింది. తను వచ్చిన పని ఎలా చెప్పాలో తెలియక తికమక పడి చివరికి, "నేను పెళ్లి చేసుకుంటాను" అని నసిగాడు, బ్రహ్మానందం.

"తప్పకుండా చేసుకోండి." పెళ్లాడటమే యువకులకు విధ్యుక్త ధర్మమన్నట్లుగా అన్నారాయన, టేబులుమీద ఉన్న తుపాకి పరీక్షిస్తూ. బ్రహ్మానందం ముఖాన్ని మళ్లీ ఓ నల్ల మేఘం కప్పేసింది. దివాన్‌బహద్దర్ పాపారాయుడు గారు గన్ పాపారాయుడుగా కనిపించారు. 'ఎవరిని చేసుకుంటారు?' అని అడుగుతారు గదా అనుకొన్న బ్రహ్మానందానికి ఏడుపు వచ్చినట్లయింది. కొంచెం తటపటాయించి, "మీ అమ్మాయి..." అర్ధోక్తిలో నసిగాడు

ఆయన తుపాకి టేబిలుపై జారవిడిచి, "మా అమ్మాయి స్నేహితులా మీరు? మేడపై ఉంది. వెళ్లి మాట్లాడుతారా?" అన్నారు.

"స్నే...హితుడినే అనుకోండి.. అయితే మాట్లాడవలసిన పని మీతోనే ఉంది."

"నాతోనా! చెప్పండి" అన్నా రాయన నిర్లక్ష్యంగా.

"నేనూ మీ అమ్మాయీ ప్రేమించుకున్నాం." ఆటంబాంబు బ్రద్దలయిందనుకున్నాడు బ్రహ్మానందం. కాని అదే సమయంలో కాఫీ ట్రే తెస్తూ కాలుజారి బోర్లగిల పడిన బట్లర్‌ను చూశాక 'హమ్మయ్య' అనిపించి మనసు కుదుటపడింది.

"ఓహో" అని తల ఊపి "రెడీ క్యాష్ ఎంత ఉంది?" అన్నారు పాపారాయుడు గారు.

ముఖంమీద చెమట తుడుచుకుంటూ "అబ్బే! తల్లీ తండ్రీ తోడూ నీడా ఎవరూ లేరండి" అన్నాడు బ్రహ్మానందం దిగాలుపడి.

"డబ్బు?" నొక్కి అడిగా రాయన మళ్లీ.

"విజయవాడలో ఓ చిన్న మేడ తప్ప మరేమీ లేదండీ. ఉద్యోగం దొరికేవరకూ నా బాధ్యత మా పినతండ్రిది." టిక్కు టిక్కుమంటూన్న గుండె పట్టుకొని చెప్పాడు బ్రహ్మానందం.

"ఇదిగో మిస్టర్ బ్రహ్మానందం! ప్రేమించుకోవడంలో తప్పులేదు. కాని పెళ్లంటే కబుర్లు చెప్పడం కాదు. పెళ్లయ్యాక ఊరికే ప్రేమించుకుంటూ ఆట పాటలతో కూర్చుంటే బ్రతుకు గడవదు. ఆడదాని సొమ్ము తిని జీవిద్దామనుకునేటంత అవివేకివి కాదనుకుంటాను నువ్వు. అదీకాక ఎంత అన్యోన్యంగా ఉన్నా భార్యాభర్తల మధ్య కీచులాటలు రాకమానవు. ఇద్దరూ సమాన తాహతు కలవాళ్లయితే అవి సర్దుకుపోవచ్చు. లేకపోతే భర్త భార్యనో, భార్య భర్తనో కించపరిచే స్థితి వస్తుంది. కలిమి లేములు కాట్లాడుకుంటాయి. అభిమానాలు రగులు కుంటాయి. అందుకే చెబుతున్నాను. ఒక్క పదివేల రూపాయలు నువ్వు సంపాదించుకు వచ్చినట్లయితే మా అమ్మాయినిచ్చి పెళ్లిచేయడానికి నాకే అభ్యంతరం లేదు" అని ఉపన్యాసం ముగించారు పాపారాయుడు గారు.

బ్రహ్మండం బ్రద్దలైనట్టు గుండె అదిరి పడింది. పదివేల రూపాయలు — ఒక్కసారిగా! తాను మరో నూరు జన్మలెత్తినా అంతడబ్బు న్యాయంగా సంపాదించలేడు. సంపాదించలేకపోతే మృణాళిని తనకు దక్కదు.


బ్రహ్మానందం విషాదంతో సెలవు తీసుకున్నాడు. అనంత సాగర దర్శనాలు విషయం తెలుసుకున్నారు. ఈ వింత సెక్యూరిటీ డిపాజిట్టు గూర్చి తర్కించుకొని మరోసారి "కాంట్ హెల్ప్" చెప్పేసి భుజాలు దులిపేసుకున్నారు. ధన సంపాదన మార్గం కనిపించక నిరాశ చేసుకుని మృణాళినిని చూడటం కూడా మానుకున్నాడు బ్రహ్మానందం. స్వానుభవాన్ని, మిత్రుల అనుభవాలను పురస్కరించుకుని 'కామన్ ఎర్రర్స్ ఇన్ లవ్‌మేకింగ్' అనే ప్రేమ భాష్యం వ్రాసి పడేశాడు మూడు మాసాలు అహోరాత్రం కూర్చుని. అప్పుడప్పుడు మృణాళిని ఉత్తరాలు వ్రాస్తూనే ఉంది. అన్నిటి సారాంశం ఒకటే—"హా! ప్రియా! అగుపించడం మానేశావు..." పాపారాయుడు గారు చెప్పిన విషయాలు కూడా సమంజసమేనోననిపించింది బ్రహ్మానందానికి. అయితే ధన సంపాదన కెటువంటి ప్రయత్నం చేయలేదు. ఆ భారం భగవంతుడికే వదిలాడు.

ఒకనాడు తాను వ్రాసిన పుస్తకం తీసుకొని శ్రీకాంత్‌ను కలుసుకునేందుకు వెళ్లాడు బ్రహ్మానందం. ఆంధ్రదేశంలో ప్రముఖ చిత్రకారుడుగా అఖండ కీర్తి సార్జించాడు శ్రీకాంత్. బ్రహ్మానందానికి ప్రాణస్నేహితుడు. బ్రహ్మానందం స్టూడియోలో అడుగు పెట్టేసరికి ఒక బిచ్చగాడిని



ప్రేమికుల జంట
చిత్రం—అజీముద్దీన్ (పాలకొండ)

మోడల్‌గా కూర్చొబెట్టుకొని చిత్రం గీస్తున్నాడు శ్రీకాంత్. బ్రహ్మానందానికి కుర్చీచూపించి తన పనిలో నిమగ్నుడయ్యాడు. బిచ్చగాడిని పరీక్షగా చూశాడు బ్రహ్మానందం. అంతులేని బాధావ్యధలను వ్యక్తంచేసే పీకుకుపోయిన కళ్లు—మాసిపోయి జడలు కట్టిన బవిరి గడ్డం—పీలికలైపోయిన ఒంటిచేతి లాల్చీని కప్పి కప్పని చింకి కంబళీ—దరిద్ర దేవత తాండవ మూర్తిలా ఉన్నాడు. ఆ శోకమూర్తిని చూడగానే బ్రహ్మానందం హృదయం కరిగిపోయింది. సానుభూతి ముఖాంఖించిన జాలి చూపులు ప్రసరించాడు. బ్రహ్మానందాన్ని చూడగానే బిచ్చగాడి ముఖంలో ఏదో మార్పు వచ్చింది. ఇంకొంచెం దీనత్వం అలముకొంది. చిత్రం పూర్తి అయినట్టే దాదాపు. శ్రీకాంత్ ఏదోపనుండి "ఇప్పుడేవస్తాను. కూర్చోండి" అని లోపలికి వెళ్లాడు.




చిత్రం—ఎస్. జయదేవ్ బాబు (మద్రాసు-21)

"చూడబ్బాయ్! నీ గుడ్డలు బొత్తిగా చినిగి పోయినట్టున్నాయి. నా దగ్గర ఏవో పాతబట్ట లున్నాయి. శ్రీకాంత్ నడిగితే మా నివాసమెక్కడో చెబుతాడు. రేపువచ్చి తీసుకెళ్ళు" అంటూ జేబులన్నీ గాలించి అరణాలన్నరతీసి, "ఇదిగో. ప్రస్తుతం నా దగ్గర ఉన్నదే ఇది. ఏమైనా కొనుక్కు తిను" అని యిచ్చాడు బ్రహ్మానందం. బిచ్చగాడు కృతజ్ఞతతో అందుకున్నాడు. కాంత్ కొన్ని రంగులు, కుంచెలు తీసుకుని వచ్చాడు.

"ఏరా ఆనందం! ఏమిటి విశేషాలు? నువ్వు రాసిన పుస్తకం తెచ్చావా?"

"ఇదిగోరా, కాంత్. చదివి నీ అభిప్రాయం చెప్పు. రేపు మళ్లీ కనుపిస్తాను. పని తొందరలో వున్నట్టున్నావ్. వస్తా" అని సెలవు తీసుకు వచ్చేశాడు బ్రహ్మానందం.

ఆనాడు అతను ఏదో అవ్యక్తమైన ఆనందం అనుభవించాడు. ఆ బిచ్చగాడి రూపం మనసులో నాటుకు పోయింది. ఇటువంటి వాళ్లు దేశంలో ఎంతమందున్నారో? కడుపునిండి తనకు అసంతృప్తి, కడుపుకు లేక వాళ్లకు ఆవేదన. తన కోరిక తీరకపోయినా ఇబ్బంది లేదు. వాళ్ల ఆకలి తీరకపోతే? తన కిక ఏ విధమైన ఆనందం లేదు. ఉన్నంతలో అటువంటి వాళ్లకు సాయం చేయటం మానవ ధర్మం. ఈ విధమైన ఆలోచనలు అతనికి ఏదో మహోపదేశంచేసి నిజమైన ఆనందాన్ని చూపించినాయి. మరునాడు బ్రహ్మానందం, శ్రీకాంత్ స్టూడియోకు వెళ్లాడు.

# దరావతు!

"రారా, ఆనందం. నీ పుస్తకం రాత్రి చదివాను. డాక్టరేటు ఇవ్వదగిన పుస్తకంరా. అంత పరిశ్రమ ఎలా చేశావో నా కర్థం కావడంలేదు."

బ్రహ్మానందం చిరునవ్వు నవ్వాడు.

"మోడల్‌గా కూర్చున్న బిచ్చగాడి కేమిచ్చావురా, కాంత్?"

"బిచ్చగాడే నాకు అయిదు వంద లిచ్చాడు. అతను నిజం బిచ్చగా డనుకున్నావు గదూ! భాగ్యనగరాన్ని ఈ తక్షణం కొనగల భాగ్యశాలి ఆయన. ను వ్వతనికి డబ్బు లిచ్చావట! అంతా చెప్పాడు. నీ వ్యథాభరిత చరితమంతా ఆయనకు పూస గ్రుచ్చినట్టు చెప్పాను. నిన్ను చాలా మెచ్చుకున్నాడు. నీ పుస్తకం కూడా చదివాడు ఇంతకు ముందే!"

బ్రహ్మానందం తలమీద పిడుగు పడ్డట్టయింది. సిగ్గుతో తలదించుకున్నాడు. తా నతనికి బట్టలు కూడా ఇస్తా నన్నాడు—పాతబట్టలు! 'సెంటిమెంటల్ క్రీచర్' బ్రహ్మానందం బాధపడిపోయాడు—ఓ పెద్ద మనిషిని అవమానం చేశానే అని.

"నా ప్రే...మ...వి...ష...యం....."

"అంతా చెప్పేశాను. ఆ అమ్మాయి ఎవరని అడిగాడు. నాతో చెప్పి ఏడిస్తేనా, నువ్వు?"

"నన్ను నిలువునా ఖూనీ చేశావురా కాంత్" అంటూ తల వంచుకు వచ్చేశాడు బ్రహ్మానందం. అతని ఆవేదనకు కారణం లేకపోలేదు. ఆస్తిపాస్తి ప్రేవులు లెక్కపెట్టే పత్రికలవాళ్లు ఏవేవో వింతకథలు అల్లి ప్రచారంచేస్తారు. దానికి తోడు ఆ పెద్దమనిషిని అవమానించాననే బాధ ఒకటి. ఇంతకూ ఆ పెద్దమనిషి ఎవరో తాను తెలుసుకోనేలేదు. దినపత్రికలన్నీ తెప్పించి ఆత్రంగా చూస్తూ మూడు రోజుల వరకూ బయటకు రాలేదు బ్రహ్మానందం. కాని బ్రహ్మానందమనే ఒక పరమాణువు ఉన్నట్లే ఏ పత్రికలవాళ్లూ (నేను తప్ప) గమనించినట్లు లేదు. నాలుగవనాడు టపాలో ఒక రిజిస్టర్ లెటర్ వచ్చింది బ్రహ్మానందానికి. ఆత్రుత, భయం అంగన్యాసం చేస్తూండగా కవరు చించాడు బ్రహ్మానందం. పది వేల రూపాయలకు చెక్కూ, ఒక చీటీ బయలు పడ్డాయి. ఆశ్చర్యంతో చదివాడు బ్రహ్మానందం.

"చిరంజీవి బ్రహ్మానందానికి బిచ్చగాని పెళ్లి కానుక" అని ఉంది అందులో. బ్రహ్మానందం తన కళ్లను తానే నమ్మలేక పోయాడు. అనంతం అమందానందంతో బ్రహ్మానందాన్ని కౌగలించుకున్నాడు. సాగరం సంతోషంతో బ్రహ్మానందాన్ని ఎత్తుకుని అటూ ఇటూ త్రిప్పేసి కిందపడెయ్యబోతే దర్శనం సుదర్శనంలా రివ్వున వచ్చి పడబోతున్న బ్రహ్మానందాన్ని పట్టుకున్నాడు. "కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుడుతాడు!" వ్యాఖ్యానించాడు దర్శనం.

"మరి అదృష్టమంటే ఏమిటి!" సాగదీశాడు సాగరం. "పిల్లిద్దరికీ ముడేశాడని నా కేనాడో తెలుసు. మీరు తగ్గండిరా!" అన్నాడు అనంతం మీసం మెలేస్తూ.

రెండు మాసాల తర్వాత ఓ శుభ ముహూర్తాన అనంత సాగర దర్శనాలు ఆనంద బాష్పాలు రాల్చారు—

శోభనం గదిలో—

"మృణా! ఆ బిచ్చగాడి చిత్రం ఇక్కడ పెట్టా రేమిటి?" సందేహ నివృత్తికోసం అడిగాడు బ్రహ్మానందం.

"అది మా నాన్న చిత్రం, ఆనంద్!"

"ఆ పుస్తకాలు...."

"అదీ 'కామన్ ఎర్రర్స్ ఇన్ లవ్ మేకింగ్' అని ఓ పిచ్చి రచయిత వ్రాసిన మంచి పుస్తకం. అచ్చొత్తించారు మా నాన్న" అంది మృణాళిని చిలిపిగా నవ్వుతూ.

"ఊహూ" అంటూ ఆమెనుదగ్గరగా లాగుకోబోయాడు ఆనందం.

ఆమె తప్పించుకొని "ఆగండి... డిపాజిట్టు!" అంది చిలిపిగా నవ్వుతూ.

"ఇదిగో" అంటూ అత డామె అధరాలను—కిటికీలోంచి దొంగచూపులు చూస్తున్న చంద్రుడు చిత్త వికారంతో మబ్బు పరదా చాటున ప్రేయసిని చూడబోయాడు. ★